క్లుప్తంగా

కారుణ్య నియామకం కింద హోంగార్డు ఉద్యోగం



దాసరి పెద్దస్వామికి నియామక పత్రం అందిస్తున్న కమాండెంట్ మహేష్‌కుమార్

కర్నూలు: విధి నిర్వహణలో హోంగార్డు దాసరి మునిస్వామి మార్చి 25వ తేదీన అనారోగ్యంతో మృతిచెందాడు. ఆ కుటుంబానికి జిల్లా పోలీసు శాఖ అండగా నిలిచింది. మృతుడి కుమారుడు దాసరి పెద్దస్వామికి కారుణ్య నియామకం కింద హోంగార్డు ఉద్యోగం కలిస్తూ ఎస్పీ విక్రాంత్ పాటిల్ నియామక ఉత్తర్వులు జారీ చేశారు. సదరన్ రీజియన్ హోంగార్డు కమాండెంట్ మేకల మహేష్ కుమార్ శుక్రవారం దాసరి పెద్దస్వామిని తన కార్యాలయానికి పిలిపించి నియామక పత్రాన్ని అందజేశారు. ఏఆర్ డీఎస్పీ భాస్కర్ రావు, హోంగార్డు డీఎస్పీ ప్రసాద్, ఆర్ఐ జావేద్, జూనియర్ అసిస్టెంట్ మాధవీ రాణి, బాధిత కుటుంబ సభ్యులు ఉన్నారు.

22న లేబర్‌కోడ్‌లపై నిరసన



మాట్లాడుతున్న ఎస్.మునెప్ప

కర్నూలు(సెంట్రల్): కార్మికుల హక్కులను కాలరాసే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 22న జిల్లావ్యాప్తంగా ధర్నాలు నిర్వహించనున్నట్లు ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్ రాధాకృష్ణ డిమాండ్ చేశారు. గురువారం ఏఐటీయూసీ కార్యాలయంలో ఆ సంఘం నగర కార్యదర్శి జి.చంద్రశేఖర్ అధ్యక్షతన కార్మిక సంఘాల నాయకులు సమావేశమయ్యారు. వారు మాట్లాడుతూ.. లేబర్ కోడ్‌లతో కార్మికులు బానిసలుగా మారిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 8 గంటల పని స్థానంలో 10-12 గంటల సమయం వచ్చిందన్నారు. ఈ నిబంధనతో మహిళలు రాత్రిళ్లు కూడా పనిచేయాల్సి వస్తోందన్నారు. కార్మిక హక్కుల పరిరక్షణ కోసం చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు విజయ్, ఆర్.నరసింహులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో సత్తా చాటాలి



లాంగ్ జంప్ చేస్తున్న బాలిక

కర్నూలు (టౌన్): ఏలూరు పట్టణంలో ఈనెల 27 నుంచి 29వ తేదీ వరకు నిర్వహించనున్న రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో అథ్లెట్లు పతకాలు సాధించాలని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ చైర్మన్ హర్షవర్ధన్ స్పష్టం చేశారు. శుక్రవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో అండర్-14 నుంచి అండర్-20 వరకు బాలబాలికలకు ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడల్లో రాణించే వారికి మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. ప్రతి రోజు సాధన చేస్తే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చన్నారు. అనంతరం పోటీల్లో ప్రతిభ చాటి రాష్ట్ర పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు విక్టర్, అథ్లెటిక్స్ మీట్ ఇన్‌చార్జ్ లక్ష్మయ్య, ఓబన్న, శ్రీనివాసులు వ్యాయామ ఉపాధ్యాయులు రాము, మల్లేష్, కోచ్ కాశీరావు పాల్గొన్నారు.

మానసిక దివ్యాంగులకు విరాళం



పాత్రలు, పరికరాలతో జి.పుల్లారెడ్డి దంత వైద్య కళాశాల బృందం

కర్నూలు(హాస్పిటల్): నగర శివారులోని జి.పుల్లారెడ్డి మానసిక, శారీరక దివ్యాంగుల ఆవాస కేంద్రానికి జి.పుల్లారెడ్డి దంత వైద్య కళాశాల విద్యార్థుల బృందం పలు పరికరాలు విరాళంగా అందించారు. ఇందులో భాగంగా 8 సీలింగ్ ఫ్యాన్లు, వంట పాత్రలు, ఒక ట్రిమ్మర్ తదితర వస్తువులను అందజేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.నాగలక్ష్మిరెడ్డి, ప్రొఫెసర్ డాక్టర్ దుగ్గినేని శ్రీనివాసులు, ఏఓ రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

సెక్యూరిటీ నిర్వహణ బాధ్యత మాదే

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు బోధనాసుపత్రిలో సెక్యూరిటీ నిర్వహణ బాధ్యత స్వతహాగా తామే నిర్వహిస్తామని ఈగల్ హంటర్ సెక్యూరిటీ సర్వీసెస్ ఏపీ కో-ఆర్డినేటర్ పి.సాయినివాస్, ఆపరేషన్స్ మేనేజర్ జి.శంకర్ చెప్పారు. శుక్రవారం సాయంత్రం ఆసుపత్రిలోని సెక్యూరిటీ కార్యాలయంలో వారు మాట్లాడారు. సెక్యూరిటీ బాధ్యతలను ఇతరులకు సబ్ లీజుకు ఇవ్వలేదని, ఈ విషయంలో వదంతులను నమ్మవద్దన్నారు. ఇప్పటికే జూన్, జులై నెలలకు సంబంధించి సెక్యూరిటీ గార్డులకు జీతాలు కూడా చెల్లించామన్నారు. కొన్ని పోస్టులు ఖాళీగా ఉన్నాయని, నెలాఖరులోపు వాటిని భర్తీ చేస్తామన్నారు.

అర్జీల పరిశీలన వేగవంతం చేయండి



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి

కర్నూలు(సెంట్రల్): ఇళ్ల స్థలాల కోసం వచ్చిన అర్జీలను త్వరగా పరిశీలన చేసి లబ్ధిదారులను గుర్తించాలని కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పీజీఆర్ఎస్, పారిశుద్ధ్యం, ఉల్లి ఎన్యుమరేషన్, యూరియా సరఫరా, హౌసింగ్, ఎంఎస్ఎంఈ పార్కులకు భూముల గుర్తింపు తదితర అంశాలపై మండలాల ప్రత్యేకాధికారులు, డివిజన్, మండల స్థాయి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇళ్ల పట్టాల కోసం వచ్చిన అర్జీల్లో ఆదోని, ఎమ్మిగనూరు అర్బన్‌లో ఎక్కువగా పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని త్వరగా పరిశీలన చేయాలన్నారు. సుమోటో క్యాస్టు వెరిఫికేషన్‌కు సంబంధించి కర్నూలు అర్బన్, కర్నూలు రూరల్, ఆదోని అర్బన్‌లో ఎక్కువగా పెండింగ్‌లో ఉన్నాయని, అదనపు సిబ్బందిని నియమించి రాత్రిళ్లు కూడా పనిచేసి త్వరగా పూర్తి చేయాలన్నారు. ఎంఎస్ఎంఈల కోసం కోడుమూరు, ఆదోని, ఆలూరు, పత్తికొండ నియోజకవర్గాల్లో భూసేకరణ పెండింగ్‌లో ఉందని, ఆయా మండలాల తహసీల్దార్లు త్వరగా కేటాయింపులు చేయాలన్నారు. రైతులు ఉల్లి పంట పక్వానికి వచ్చిన తరువాతే కోతలు చేపట్టేలా అవగాహన కల్పించాలని, ఖరీఫ్ సీజన్‌లో వర్షాల కారణంగా దెబ్బతిన్న ఉల్లిని త్వరగా ఎన్యుమరేషన్ చేసి నివేదిక పంపాలని ఆదేశించారు. ఈ-క్రాప్ బుకింగ్‌ను త్వరగా పూర్తి చేయాలన్నారు. యూరియా పంపిణీలో సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని వ్యవసాయధికారులను ఆదేశించారు. రైతు సేవా కేంద్రాల్లో యూరియాను అందుబాటులో ఉంచాలన్నారు. కోర్టు కేసుల్లో నిర్లక్ష్యం వహించరాదని, సకాలంలో స్పందించి అప్పీలు ఫైళ్లను అమలు చేయాలన్నారు. అనంతరం ప్రధానమంత్రి అవాస్ యోజన అర్బన్-2కు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జేసీ డాక్టర్ బి.నవ్య, డీఆర్వో సి.వెంకట నారాయణమ్మ, హౌసింగ్ పీడీ చిరంజీవి, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి పాల్గొన్నారు.

చేనేత వస్త్రాలు, ఉత్పత్తులపై డిస్కౌంట్

కర్నూలు(అగ్రికల్చర్): విజయ దశమి సందర్భంగా నవరాత్రులను పురస్కరించుకొని లేపాక్షి హ్యాండీక్రాఫ్ట్ ఎంపోరియంలో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు ఆకట్టుకుంటోంది. దసరా పర్వదినం సందర్భంగా చేనేత వస్త్రాలపై 10 శాతం, హ్యాండీ క్రాఫ్ట్ వస్తువులపై 15 శాతం తగ్గింపుతో అమ్మకాలు ఉంటాయని లేపాక్షి హ్యాండీక్రాఫ్ట్ ఎంపోరియం మేనేజర్ తిమ్మయ్య తెలిపారు. ఆంధ్రప్రదేశ్ హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఆదేశాల మేరకు బొమ్మల కొలువు ఏర్పాటు చేయడంతో పాటు తగ్గింపు ధరలతో అమ్మకాలు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కొండారెడ్డిబురుజు సమీపంలోని లేపాక్షి ఎంపోరియంలో నవరాత్రులు ముగిసే వరకు బొమ్మల కొలువు ఉంటుందని, అదే విధంగా తగ్గింపుపై చేనేత వస్త్రాలతో పాటు హ్యాండీ క్రాఫ్ట్ వస్తువుల అమ్మకాలు జరుగుతాయని పేర్కొన్నారు. జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మహిళలు పౌష్టికాహారం తీసుకోవాలి



మాట్లాడుతున్న డాక్టర్ సింధియా శుభప్రద

కర్నూలు(హాస్పిటల్): ప్రతి మహిళా ఆరోగ్యంగా ఉండేందుకు పౌష్టికాహారం అవసరమని కర్నూలు మెడికల్ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్, కమ్యూనిటి మెడిసిన్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ సింధియా శుభప్రద అన్నారు. శుక్రవారం స్థానిక శ్రీరామనగర్‌లోని యూపీహెచ్‌సీలో 'స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా మహిళలకు పోషకాహారం గురించి అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సింధియా శుభప్రద మాట్లాడుతూ.. మహిళలు పోషకాహారంపై అవగాహన ఏర్పరచుకోవడం ద్వారా వారి కుటుంబంలోని సభ్యులందరికీ పౌష్టికాహారాన్ని అందించగలరన్నారు. కుటుంబ ఆరోగ్యమే సమాజ ఆరోగ్యమని తెలిపారు. కార్యక్రమ నోడల్ ఆఫీసర్ డాక్టర్ మాధవీ శ్యామల మాట్లాడుతూ.. మహిళలు కుటుంబ సభ్యులతో కలిసి ఆహారం తినాలన్నారు. బలవర్ధకమైన ఆహారమంటే ఖరీదైనవే కాదని, మనకు అందుబాటులో ఉండే ఆకుకూరలు, కూరగాయలు, పప్పు దినుసులు వంటివి తీసుకోవచ్చన్నారు. అనంతరం వివిధ రకాల పోషకాహార పదార్థాలు, ఆకుకూరలు, కూరగాయలను కమ్యూనిటీ మెడిసిన్ పీజీలు, హౌస్‌సర్జన్లు ప్రదర్శనకు ఉంచి వాటి పోషక విలువల గురించి వివరించారు. అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ అరుణ, అర్బన్ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాజనందిని, సీనియర్ రెసిడెంట్ డాక్టర్ యాస్మిన్, పీజీ సబీహా తదితరులు పాల్గొన్నారు.

వడ్డె గేరి యూపీహెచ్‌సీలో..

స్థానిక వడ్డె గేరిలోని యూపీహెచ్‌సీలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డెమో శ్రీనివాసులు శెట్టి మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆరోగ్యవంతమైన మహిళ-శక్తివంతమైన కుటుంబం అనే నినాదంతో ఈ నెల 17వ తేదీ నుంచి వచ్చే నెల 2వ తేది వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నాయన్నారు. వైద్యులు వెంకట ప్రవీణ్, డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ పద్మావతి, సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్‌ను వినియోగించుకోవాలి

కర్నూలు (టౌన్): కర్నూలు నగరంలోని దామోదరం సంజీవయ్య సర్కిల్, వై.జంక్షన్, గుత్తి పెట్రోల్ బంకు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఎల్ఆర్ఎస్ మేళాలను ప్రజలు వినియోగించుకోవాలని కమిషనర్ పి.విశ్వనాథ్ వెల్లడించారు. ప్రజలకు ఉన్న అనుమానాలు, సందేహాలను ఈ మేళాలో తీర్చుకోవచ్చన్నారు. అనధికారిక లేఔట్లను క్రమబద్ధీకరించుకోవాలన్నారు. మేళాలో సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, అంజద్‌బాషా, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మొక్కల పంపిణీ

నగరాన్ని క్లీన్ అండ్ గ్రీన్ సిటీగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా 6 వేల మొక్కలు పంపిణీ చేయనున్నట్లు కమిషనర్ పి.విశ్వనాథ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పచ్చ సుంకేసుల, కొండ తంగేడు, గుల్మోహర్, ఎర్ర సుంకేసుల, గంగరావి, సీతాఫలం, తపస్సీ, కానుగ, జామ, వేప వంటి 9 రకాల మొక్కలు పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు.

కుమార్తెకు కిడ్నీ ఇచ్చి బతికించుకున్న తల్లి

కర్నూలు(హాస్పిటల్): ప్రాణాపాయ స్థితిలో ఉన్న 12 ఏళ్ల కుమార్తెకు తల్లి కిడ్నీ ఇచ్చి బతికించుకుంది. చికిత్స వివరాలను శుక్రవారం కర్నూలులోని కిమ్స్ హాస్పిటల్‌లో సీఓఓ సునీల్ సేపూరి వివరించారు. సహస్ర అనే బాలికను కాళ్లు, ముఖం వాపు, ఆకలి లేకపోవడం లాంటి సమస్యలతో తల్లిదండ్రులు గత నెల 31న కర్నూలు కిమ్స్ ఆసుపత్రికి తీసుకొచ్చారన్నారు. వైద్య పరీక్షల్లో బాలిక కిడ్నీలు విఫలమైనట్లు తెలిసిందన్నారు. ముందుగా డయాలసిస్ ప్రారంభించి కిడ్నీ మార్పిడి చేయాలని నిర్ణయించారు. కిడ్నీ ఇచ్చేందుకు తల్లి ముందుకు రాగా వారిద్దరి రక్తం గ్రూపులు వేర్వేరు కావడంతో ప్రత్యేకమైన డీసెన్సిటైజేషన్ ప్రోటోకాల్ అమలు చేశారు. ముందుగా ప్లాస్మా మార్పిడి చేశారు. మందుల ద్వారా శరీరంలో యాంటీబాడీల స్థాయి తగ్గగానే ఈ నెల 1న కిడ్నీ మార్పిడి ఆపరేషన్ విజయవంతంగా పూర్తి చేశారు. ఈ నెల 10న ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేశారు. పునః వైద్యచికిత్స కోసం పాపను ఆసుపత్రికి తీసుకురాగా పూర్తిగా కోలుకున్నట్లు వైద్యులు వెల్లడించారు.

జగన్మయుడు పుస్తకావిష్కరణ



జగన్మయుడు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి, బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి, దారా సుధీర్ తదితరులు

కర్నూలు (టౌన్): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి, యువజన విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి, నందికొట్కూర్ నియోజకవర్గ సమన్వయకర్త దారా సుధీర్ శుక్రవారం బైరెడ్డి స్వగృహంలో జగన్మయుడు పుస్కకాన్ని ఆవిష్కరించారు. పార్టీ నాయకులు రమేష్‌నాయుడు, మల్లారెడ్డి, సోమల సుధాకర్ రెడ్డి, పోచా జగదీశ్వర రెడ్డి, లోకేశ్వర రెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన వైద్యసేవలందించడమే లక్ష్యం



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు

కర్నూలు(హాస్పిటల్): ఆసుపత్రికి వచ్చిన రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యమని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు చెప్పారు. శుక్రవారం కర్నూలు మెడికల్ కాలేజీలోని కాన్ఫరెన్స్ హాలులో అన్ని విభాగాధిపతులతో సమీక్ష నిర్వహించారు. రోగులకు అందుతున్న వైద్యసేవల నాణ్యత, అత్యవసర విభాగం పనితీరు, సిబ్బంది హాజరు, ఆసుపత్రి శుభ్రత, పరికరాల వినియోగం, సీజనల్ వ్యాధుల నియంత్రణ చర్యలు వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. ప్రతి విభాగాధిపతి తమ విభాగంలోని పనితీరు, ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కారం కోసం తీసుకుంటున్న చర్యలపై వివరించారు. ఆసుపత్రులపై ప్రజలకు గల విశ్వాసాన్ని నిలబెట్టుకోవడం మనందరి బాధ్యత, రోగులకు సమయానికి మెరుగైన చికిత్స అందించేందుకు అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని, రోగులతో సిబ్బంది మర్యాదపూర్వకంగా వ్యవహరించి వారి సమస్యలకు వెంటనే స్పందించాలని సూపరింటెండెంట్ ఆదేశించారు. ఆసుపత్రి సదుపాయాల వినియోగంలో ఎలాంటి లోపాలు లేకుండా చూసుకోవాలని సూచించారు. రాబోయే రోజుల్లో డెంగీ, మలేరియా, వైరల్ ఫీవర్ వంటి సీజనల్ వ్యాధులు పెరిగే అవకాశం ఉందని, ముందస్తు చర్యలు తీసుకోవాలని వైద్యులకు చెప్పారు. అవసరమైన ఔషధాలు, పడకలు, పరీక్షల పరికరాలు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ, ఇన్‌చార్జ్ సీఎస్ఆర్ఎంవో డాక్టర్ వెంకటరమణ, డిప్యూటీ సీఎస్ఆర్ఎంవో డాక్టర్ పద్మజ, అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రహ్మణ్యం, వైద్యులు పాల్గొన్నారు.

21న నర్తన శాల సినిమా ప్రదర్శన

కర్నూలు కల్చరల్: టీజీవీ కళాక్షేత్రం ఆధ్వర్యంలో ఈనెల 21న రాజ్యం పిక్చర్స్ వారి 'నర్తన శాల' సినిమా ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు అధ్యక్షుడు పత్తి ఓబులయ్య తెలిపారు. భాద్రపద నామ సంవత్సరం దసరా పండుగ కానుకగా కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణ ఆపాలి



అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం ఇస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

కర్నూలు కల్చరల్: విద్య, వైద్య రంగాల ప్రైవేటీకరణను ఉపసంహరించుకోవాలని, విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆర్ యూలో అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న రూ.6400 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ను విడుదల చేయాలన్నారు. బకాయిలు విడుదల చేయకపోవడంతో కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని వాపోయారు. విద్య, వైద్యాన్ని ప్రైవేట్‌పరం చేస్తూ బడుగు బలహీన వర్గాల వారికి ఉచిత విద్యను దూరం చేస్తున్నారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుల చేయకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. వర్సిటీ నాయకులు అలీ, ప్రశాంత్, రమేష్, ధర్మ తేజ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె బాట



ఆందోళన చేస్తున్న సచివాలయ ఉద్యోగులు

కర్నూలు(సెంట్రల్): తమ సమస్యలను పరిష్కరించాలని లేనిపక్షంలో అక్టోబర్ నుంచి సమ్మెలోకి వెళ్తామని సచివాలయ ఉద్యోగుల జేఏసీ నాయకులు భాస్కరరెడ్డి, శివప్రసాదు, రవి యాదవ్, మగ్బూల్ హుస్సేన్ స్పష్టం చేశారు. ఈనెల 8వ తేదీ నుంచి చేపట్టిన ఆందోళనల్లో భాగంగా శుక్రవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరికి ఆమె కార్యాలయంలో వినతిపత్రం ఇచ్చారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులను సర్వే పేరుతో క్షేత్ర స్థాయికి పంపి అవమానాలపాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. తమ చదువుకు విలువ ఇచ్చి రాష్ట్రాభివృద్ధికి అవసరమైన సేవలను తమతో చేయించుకోవాలన్నారు. ముఖ్యంగా ఇంటింటికీ తిరిగే సర్వేలకు దూరంగా ఉంచాలని కోరారు. తమను తమ శాఖల మాతృసంస్థలకు అప్పగించాలని, సమయపాలన పాటించేలా విధంగా చర్యలు తీసుకొని పని ఒత్తిడి లేకుండా చూడాలని కోరారు. ఆరేళ్ల పాటు ఒకే క్యాడర్‌లో పనిచేసిన వారికి ఏఏఎస్ ప్రకారం స్పెషల్ ఇంక్రిమెంటు ఇవ్వాలని, నోషనల్ ఇంక్రిమెంట్ ఇవ్వాలని, తమకు జూనియర్ అసిస్టెంట్ హోదా కల్పించాలని, అన్ని విభాగాల మాదిరిగా పదోన్నతులు కల్పించాలని, స్టేషన్ సీనియారిటీ ఆధారంగా బదిలీలు చేపట్టాలని కోరారు.

శానిటరీ ఇన్‌స్పెక్టర్‌పై ఆగ్రహం



శానిటరీ ఇన్‌స్పెక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కమిషనర్ పి.విశ్వనాథ్

కర్నూలు (టౌన్): పారిశుద్ధ్యం విషయంలో ఇప్పటికే ఒకసారి సస్పెండ్ చేశా.. అయినా మారవా? నీకు పని చేత కాదు.. పారిశుద్ధ్య పనులు సక్రమంగా చేయడం లేదు అని శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమేష్‌పై శుక్రవారం సాయంత్రం నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. దుర్గామాత నిమజ్జన ఉత్సవాలు జరుగుతాయి. శుభ్రంగా పెట్టాలని తెలియదా? అని ప్రశ్నించారు. పారిశుద్ధ్య నిర్వహణలో అధికారులంతా విఫలం చెందారన్నారు. స్థానిక సంకల్‌బాగ్ ఏరియాలో కమిషనర్ నిమజ్జన ఏర్పాట్లు, పారిశుద్ధ్య పనులు పరిశీలించారు. తుంగభద్రలో అమ్మవారి విగ్రహాలు వస్తాయని, స్థానికంగా అయ్యకార్ భవన్ నుంచి సంకల్ బాగ్ వరకు గుంతలు పూడ్చాలని ఆదేశించారు.

తాగునీరు దుర్వాసన వస్తోంది

సంకల్‌బాగ్ వద్ద నిమజ్జన ఏర్పాట్లు, పారిశుద్ధ్య పనులు పరిశీలించేందుకు వచ్చిన కమిషనర్‌కు స్థానిక మహిళ ఫిర్యాదు చేసింది. తాగునీరు దుర్వాసన వస్తున్నాయని, ఎన్నిసార్లు చెప్పిన వాటర్ వర్క్స్ సిబ్బంది పట్టించుకోవడం లేదని వాపోయారు. దీనిపై స్పందించిన కమిషనర్ తాగునీటిని పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. సంకల్‌బాగ్ ఏరియా లైన్‌మెన్ సుధాకర్‌పై చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు.

మత్తు పదార్థాల జోలికి వెళ్లొద్దు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న స్ఫూర్తి వెల్ఫేర్ సొసైటీ సభ్యులు

కర్నూలు: యువత గంజాయి, మద్యపానానికి అలవాటు పడి వ్యసనపరులుగా మారుతూ డబ్బు కోసం దొంగతనాలు చేయడం, చైన్ స్నాచర్స్‌గా హత్యలు చేస్తూ సంఘంలో చెడ్డ పేరు తెచ్చుకుంటున్నారని, మత్తు పదార్థాల జోలికి వెళ్లకుండా యువత గౌరవప్రదమైన జీవితం గడపాలని స్ఫూర్తి వెల్ఫేర్ సొసైటీ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ శివశంకర్ సూచించారు. 'మత్తు పదార్థాల వ్యసన నిర్మూలన' అనే అంశంపై స్ఫూర్తి వెల్ఫేర్ సొసైటీ పునరావాస కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం మిలటరీ కాలనీలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. నిషా ముక్తి అభియాన్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు, మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా ఎలా ఉండాలో అవగాహన కల్పించారు. యవ్వన దశలో నేర్చుకునే అలవాట్లు కుటుంబం, సంఘంలో మంచి పేరు తెచ్చుకునేలా ఉండాలని సూచించారు. స్ఫూర్తి వెల్ఫేర్ సొసైటీ సభ్యులు నాగేంద్ర, ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరి, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసులో జైలు, జరిమానా



అట్రాసిటీ కేసులో జైలు శిక్ష ఖరారైన నిందితులతో పోలీసులు

కర్నూలు: దంపతులను కులం పేరుతో దూషించడంతో పాటు దాడిచేసి గాయపరచిన ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు నిందితులకు 9 సంవత్సరాల జైలు శిక్ష, మొదటి నిందితుడు నేష శ్రీనివాసులుకు రూ.25 వేలు జరిమానా, మిగతా వారికి ఒక్కొక్కరికి రూ.20 వేలు చొప్పున జరిమానా విధిస్తూ కర్నూలు జిల్లా ఎస్సీ, ఎస్టీ అత్యాచార కేసుల జిల్లా న్యాయస్థానం జడ్జి పి.వాసు శుక్రవారం తీర్పు చెప్పారు. కల్లూరు వీకర్ సెక్షన్ కాలనీలో సుగాలి గోవిందమ్మ ఇంటి పక్కన ఎన్.శ్రీనివాసులు కుటుంబం నివశిస్తున్నారు. గోవిందమ్మ ఇంటి నుంచి మురుగు నీరు తమ స్థలంలోకి వస్తున్నాయని 2018 మే 17న అభ్యంతరం చెబుతూ కులం పేరుతో దూషించారు. ఆమెతో పాటు భర్త లోక్ నాయక్‌పై ఎన్.శ్రీనివాసులు, సరోజ, జ్యోతి, రాజు, వెంకటేశులు దాడి చేసి గాయపరచినట్లు ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీ మురళీధర్ నిందితులపై చార్జిషీటు దాఖలు చేశారు. అదే నిందితులు 2018 జూన్ 3వ తేదీ లోక్‌నాయక్ ఇంటి ముందు ఉండగా.. ఎన్నిసార్లు చెప్పినా మీరు వినరా? బట్టలు ఉతికిన నీళ్లు మా స్థలంలో పోస్తారా అంటూ మళ్లీ కులం పేరుతో దూషించి వారిపై దాడి చేసి గాయపర్చగా ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీ నిందితులపై అభియోగ పత్రాలు దాఖలు చేశారు. కేసు విచారణలో రెండు వేర్వేరు కేసుల్లో నిందితులపై నేరం రుజువు కావడంతో జైలు శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

సైట్ ఇంజినీర్ అదృశ్యం



విజయ్‌కుమార్ (ఫైల్)

కోడుమూరు రూరల్: నెల్లూరు జిల్లాలోని గండ్లవీడు గ్రామానికి చెందిన విజయ్‌కుమార్ (27) గూడూరు మండలంలోని సుంకేసుల డ్యాం వద్ద కేవీఎస్ఆర్ ఇన్‌ఫ్రాటెక్ ప్రాజెక్టులో సైట్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు. అయితే విజయకుమార్ ఈనెల 17వ తేదీ నుంచి కనిపించడం లేదని, ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తోందని అతని మేనమామ నాగేశ్వరరావు శుక్రవారం గూడూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గూడూరు ఎస్ఐ చిరంజీవి కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు. విజయ్‌కుమార్ ఆచూకీ తెలిసిన వారు గూడూరు పోలీసులకు (సెల్ - 91211 01072) సమాచారం తెలుపాలంటూ అతని ఫొటో విడుదల చేశారు.

విద్యార్థులపై కేసులు పెట్టడం అన్యాయం



మాట్లాడుతున్న ఆర్.నరసింహులు

కర్నూలు(సెంట్రల్): ఆదోని మెడికల్ కాలేజీని ప్రైవేట్ పరం చేయరాదని ఎస్ఎఫ్ఐ విద్యార్థులు ఆందోళన చేస్తే పోలీసులతో కొట్టించి అక్రమంగా కేసులు పెట్టడం అన్యాయమని సీఐటీయూ నగర కార్యదర్శి ఆర్.నరసింహులు మండిపడ్డారు. ఆయన శుక్రవారం కార్మిక, కర్షక భవన్‌లో మాట్లాడుతూ.. ప్రభుత్వ మెడికల్ కాలేజీని ప్రైవేట్‌కు ఇవ్వరాదని ఆందోళన చేపట్టిన ఎస్ఎఫ్ఐ విద్యార్థులకు సీఐటీయూ పూర్తిగా అండగా ఉంటుందన్నారు. ఆందోళనలో పాల్గొన్న జిల్లా కార్యదర్శి రంగప్ప, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, జిల్లా అధ్యక్షుడు సాయి తదితరులపై పోలీసులు కేసులు పెట్టారన్నారు. అంతేకాక ఆందోళనలో పాల్గొన్న విద్యార్థులపై కర్కశంగా లాఠీ చార్జీ చేసి బూటు కాళ్లతో తన్నుతూ పిడిగుద్దులు గుద్దుతూ దేశ ద్రోహుల మాదిరిగా దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. ప్రైవేట్ కాలేజీల్లో పేద, మధ్య తరగతి విద్యార్థులకు కేవలం 50 శాతం సీట్లు మాత్రమే ఉంటాయని, మిగిలిన సీట్లను ఆయా యాజమాన్యాలు అమ్ముకుంటాయన్నారు. అప్పుడు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని వివరించారు. వెంటనే విద్యార్థి సంఘాల నాయకులపై పెట్టిన కేసులను ఎత్తి వేయకపోతే పోరాటాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. నాయకులు సుధాకరప్ప, రాముడు, సాయిబాబా, రాధాకృష్ణ, ఎస్ఎండీ రఫీ, వెంకటేశ్వర్లు, ఏసు, ఓబులేషు, లక్ష్మీబాయి, వైనగేస్ పాల్గొన్నారు.

నేడు బ్రాహ్మణ సంఘం సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న సండేల్ చంద్రశేఖర్

కర్నూలు(అర్బన్): స్థానిక సంకల్‌బాగ్ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో శనివారం నగర బ్రాహ్మణ సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్షుడు సండేల్ చంద్రశేఖర్ తెలిపారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ సమావేశంలో బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన కలపటపు బుచ్చి రాంప్రసాద్, నూతన డైరెక్టర్లను సన్మానించడం జరుగుతుందన్నారు. అలాగే నగరంలోని బ్రాహ్మణ బాంధవులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి వాటి పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలో చర్చించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశానికి నగరంలోని వేద పండితులు, పురోహితులు, అర్చకులు, మహిళలు, విద్యార్థులు హాజరు కావాలని కోరారు. సమావేశం అనంతరం మధ్యాహ్న భోజనం ఉంటుందన్నారు. సంఘం నాయకులు చెరువు దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.